# మన ఇతిహాసాలు

సీతారామాయణం

*

మహాభారతం

*

శ్రీకృష్ణావతారం

*

గీతానుబంధం

*


చాణక్యుడు –రాజనీతి

(అనుబంధం)

*

రావులపాటి సీతారాంరావు

ఎమెస్కో




# సీతారామాయణం

'నువ్వు రోజూ అన్నం తింటున్నావా – లేదా!'

'తింటున్నాను.'

'ఎందుకు?'

'ఆకలేస్తుంది కాబట్టి' తరుణి తడుముకోకుండా చెప్పింది.

నీకు ఆకలి వేస్తే ఎట్లా అన్నం తింటున్నావో ప్రతి రోజూ, మనిషి మంచిగా బ్రతకటం కోసం రామాయణం కథ ప్రతి రోజూ తెలుసుకున్నా తప్పు లేదు. లక్కీగా నాన్నకు విశ్వనాథ వారి మాట జ్ఞాపకం వచ్చి అలా ఏదో చెప్పగలిగాడు. లేకపోతే తరుణి ప్రశ్నకు జవాబు చెప్పటం కష్టమే!

అట్లాగే – రాక్షసుల్లోనూ మంచివారున్నారు. రామాయణాన్ని ఆ విషయం స్పష్టంగా తెలుసుకోటానికే మళ్ళీ కథగా మీకు చెప్తాను. మీరు సరేనాన్నా – ఓకే అంటేనే!

నాన్న మాటలకు యిద్దరు పిల్లలు 'ఓకే' అని అన్నారు – అయిష్టంగానే! పాతకథ గదా!

రామాయణం రచించిన వాల్మీకిని గురించి మొదట తండ్రి చెప్పాడు.

ఒక రోజు నారదుడు వాల్మీకి ఆశ్రమానికి వెళ్ళినప్పుడు వాల్మీకి అడిగాడు–

"అన్నీ తెలిసిన మిమ్ములను ఒక ప్రశ్న అడగాలనుకుంటున్నాను. ప్రపంచంలోని అందరి కథానాయకుల్లో ధర్మపరంగా, విజ్ఞానపరంగా ఎవరిని మీరు గొప్పవాడిగా భావిస్తున్నారు?"

వాల్మీకికి వున్న ఉద్దేశ్యం అర్థం అయింది నారదుడికి. "రాముడు! – నువ్వు అడిగే అన్ని లక్షణాలు వున్న పురుషోత్తముడు శ్రీరాముడు. కోసల రాజ్యాధీశుడు సూర్య వంశానికి చెందిన దశరధుని పుత్రుడు" అని చెప్పాడు. అంతేగాదు రాముని కథను క్లుప్తంగా చెప్పాడు వాల్మీకికి!

వాల్మీకిని ఆ కథ ఎంతగానో ఆకట్టుకుంది. తామస నదికి స్నానానికి వెళ్ళినప్పుడు గూడా వాల్మీకి ఆ కథను గురించే ఆలోచించసాగాడు.

నదీ తీరాన నడుస్తున్నప్పుడు రెండు క్రౌంచపక్షులు దగ్గరే వున్న చెట్టు మీద ప్రేమ సల్లాపాలు సాగిస్తూ ఆనంద తీరాల్లో విహరిస్తున్నప్పుడు ఒక వేటగాడి బాణం మగపక్షిని బలికొన్నది. పడిపోయిన తన తోటి పక్షిని చూసి మిగిలివున్న పక్షి ఆవేదనతో తల్లడిల్లటం చూసిన వాల్మీకికి అప్రయత్నంగానే శాపంలా నోటి నుంచి మాటలు వచ్చాయి.

"ప్రేమలో వున్న ఒక పక్షిని నువ్వు చంపావు కాబట్టి – నీడలేక నువ్వు జీవితాన్ని గడుపుతూ తిరుగుతునే వుంటావు."

క్షణంలోనే వాల్మీకి తను ఎందుకిలా కోపంలో మాట జారాను అని మధనపడసాగాడు. ఆ విధంగా వేటగాడికి శాపం యిచ్చే హక్కు నాకేం వుంది అని అనుకోసాగాడు. కానీ కోపంలో వచ్చిన తన మాటలు శ్లోకరూపంలో రావటం గమనించి ఆశ్చర్యపడి కళ్ళు మూసుకుని ప్రార్థించసాగాడు వాల్మీకి! తపస్సు లాంటి యోగనిద్రలో వున్నప్పుడు బ్రహ్మదేవుడు కనిపించి "శోకంలోంచి శ్లోకం వచ్చింది. యీ శ్లోకం మాదిరే నీ నోటి వెంట రామాయణం రసభరితంగా వెలువడుగాక – ఆ రామాయణం అన్ని కాలాలపాటు పర్వతాలు వున్నంతవరకు, నదులు ప్రవహించేంత వరకు మనిషి జీవనపథంలో వెలుగులు విరజిమ్ముతూ సుఖదుఃఖాలను, ధర్మనిరతిని తెలియజేస్తుంది" అని చెప్పాడు.

ఆ విధంగా వాల్మీకి విరచితమైన రామాయణం భారతీయుల జీవనంలో మిళితమై ఒక భాగమైంది!

వాల్మీకి రచించిన రామాయణ గాథను యిప్పుడు మొదలుపెట్టాను – పిల్లలూ వినండి!



# మహాభారతం

## ఉపక్రమణిక

మహాభారతాన్ని లోకానికి అందించిన వాడు వేదవ్యాసుడు.

వ్యాసుడి మనసులో ఈ పవిత్రకథ మెదిలినప్పుడు బ్రహ్మను ప్రార్థించి 'స్వామీ ఈ కథను నేను చెప్తుంటే రాసేవారు ఎవరు?' అని అడిగాడు. 'గణపతిని రాయసకాడుగా, ప్రార్థించి ఒప్పించుకో' అని బ్రహ్మ చెప్పాడు. గణపతిని ప్రార్థన ద్వారా ప్రత్యక్షం చేసుకొని అడిగినప్పుడు అందుకు గణపతి ఒప్పుకున్నాడు. కానీ ఒక షరతు విధించాడు. 'నేను వ్రాస్తున్నప్పుడు నీవు ఆగకుండా చెప్తేనే వ్రాస్తాను' – అన్నది ఆ షరతు!

దానికి ఒప్పుకున్న వ్యాసుడు 'మంచిది కానీ నేను చెప్తున్నప్పుడే అర్థం గ్రహించి, తర్వాతే రాయాలి' అన్నది ప్రతి షరతుగా పెట్టాడు.

ఏమయితేనేం – యిద్దరి వల్లనే మహాభారతం గ్రంథస్తమయింది! వ్యాసుడు చెప్పాడు. గణపతి రాసాడు!

వ్యాసుడి కొడుకు శుకుడికి మొదటగా నేర్పిన ఈ కథ కాలక్రమేణా, ముద్రణాలయాలులేని రోజుల్లో కూడా బహుళ వ్యాప్తి చెంది, భావితరాలకు అందించకపోయినట్లయితే, మహాభారతం మనకు దక్కేది కాదు.

***




# శ్రీకృష్ణావతారం

(శ్రీమద్భాగవతం - దశమస్కందం)

# రసభరిత భాగవతం ప్రారంభం

జగజ్జనని శ్రీదేవి సర్వశక్తి స్వరూపిణి త్రిగుణాత్మకమైన స్వీయశక్తిచే లోకాలను సృష్టించి, పెంచి, లయ కాలంలో అంతరింపచేసే విశ్వజననిని ప్రకృతిగా ఆరాధించే పురుషుడు ఒక విధంగా ప్రకృతిలో లయమవక తప్పదు!

విశ్వం అంటే ప్రకృతి – పురుషుల కలయికే! అదే సృష్టి!

నిత్యమూ చూస్తున్న ఈ ప్రపంచంలో మాయతో మమేకమైన మనం భగవంతుని కోసం వెతుక్కుంటూనే వుంటాం! నేను భగవంతుడిని అన్న ఎరుక కలిగినప్పుడు నేనెవరిని? అని ప్రశ్నించుకోడు. ఆ 'నేను' ను ఎరిగి ఉన్నవాడు కనుక!

మన గ్రంథాలు, శ్రీ రామాయణ భారత, భాగవతాలు అజరామరంగా వుండటానికి కారణం సృష్టి రహస్యాలను తేటతెల్లం చేయటం వల్లనే!

రామాయణ సృష్టికర్త వాల్మీకి – శ్రీరాముడిని ఉత్తమ పురుషుడిగా తీర్చి దిద్దటానికి ఒక కారణం వుంది. మనిషి ధర్మపథంలో నడిచినప్పుడు, చుట్టూ వున్న వారు అతడిని భగవంతుడిగా భావిస్తారు, ప్రార్థిస్తారు. కానీ రామచంద్రమూర్తి – ఎక్కడా తాను భగవంతుడినని చెప్పుకోలేదు. అది త్రేతాయుగంలో!

ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడు తానే భగవంతుడనని చెప్పుకున్నాడు. శిష్టులను రక్షించటానికి, దుష్టులను శిక్షించటానికి తాను అవతారాలు ఎత్తుతూనే వుంటానని భగవద్గీత సాక్షిగా చెప్పాడు. కృష్ణుడు ఆ విధంగా వుండటానికి బహుశా అప్పటి కాలమాన పరిస్థితులే కారణం కావచ్చు. శ్రీకృష్ణావతారంతో అన్ని రసాలనూ చవిచూసినట్లయింది. రామాయణం రసభరితమైనా అత్యంత రసాస్వాదన భాగవతంలో లభిస్తుందని కొందరంటారు. భారతం సరే సరి! నవరసాల మిళితమే ఆ కావ్యం. అందుకే ఈ మహత్తరమైన కావ్యాలు జన జీవన స్రవంతిలో కలిసిపోయి సాహిత్యానికి వన్నె తేవటంతో పాటు జీవన స్రవంతిలోని



# గీతానుబంధం

# గీతానుబంధం


భగవద్గీత చిన్నప్పుడు చదవలేదు. ఇప్పుడు చదివి అర్థం చేసుకొని సాధికారత సాధించానని చెప్పే ఉద్దేశ్యం నాకు లేదు. కానీ యీ వయసులో చిన్నప్పటి విషయాలు జ్ఞాపకం చేసుకుంటున్నప్పుడు ప్రతి చిన్న విషయంలోనూ భగవద్గీత నాకు కనపడుతున్నది.

పరీక్షలంటే భయం. పరీక్ష రాసేందుకు చిన్నప్పుడు సిద్ధమై పరీక్ష హాలులో ప్రవేశించబోయే ముందు కూడా – 'ఎందుకు నాకీ పరీక్షలు? నేను చదువు కోకుండా పెద్దవాడినై బ్రతకలేనా? ఎవరికోసం? అసలు యీ పరీక్షలు జీవితంలో నాకు ఏం తెచ్చిపెట్తాయి? ఇప్పుడు నేను చూస్తున్న పెద్ద వాళ్ళందరికీ చదువు వుందా? వాళ్ళు చదువులేకపోయినా హాయిగా వున్నారు గదా!' అనే భావనలతో ఎగ్జామినేషన్ హాలులో నుంచి పరీక్ష రాయకుండా బయటకు రావాలనిపించేది. బహుశా చాలా మంది పిల్లలకు ఆ భావన కలుగుతుందేమో అన్న ఆలోచన కూడా వుంది!

పరీక్షలంటే పిల్లవాడు ఎలా పెన్నూ పారేసి పరీక్ష హాలు నుంచి బయటకు రావాలని భావించాడో, అలాగే అర్జునుడు కూడా గాండీవాన్ని ప్రక్కన పారేసి యుద్ధభూమి నుంచి నిష్క్రమించాలనే భావననే కృష్ణుడికి చెప్పి వుండవచ్చు. పరీక్ష హాలులోని విద్యార్థి భావనకు, కురుక్షేత్రంలోని అర్జనుడి భావనకు సామీప్యత ఆపాదించటం సమర్థనీయం కాదు కానీ పరీక్షలో జయం సాధించటానికి, యుద్ధంలో విజయసాధనకు పోలికను మాత్రమే గమనించాలి!

**అర్జున ఉవాచ**

**దృష్ట్వేమం స్వజనం కృష్ణ ।**
**యుయుత్సుం సముపస్థితమ్ ॥**



# చాణక్యుడు - రాజనీతి

# ఒక పరిశీలన

## చాణక్యుడి దృష్టిలో ఏది నివాస యోగ్యమైన ప్రాంతం?

కుటిలత్వాన్ని ఆపాదించే కౌటిల్యుడి పేరుతో చాణక్యుడిని పిలవటం అసంబద్ధంగా చాలా మందికి అనిపిస్తుంది. చాణక్యుడి పేరు తండ్రి చణక నుంచి వచ్చినట్లు చరిత్రకారులు చెబుతారు. విష్ణుగుప్త అనే పేరు కూడా చాణక్యుకు వున్నట్లుంది. అర్ధశాస్త్రం పేరుతో వున్న గ్రంథం చాణక్యుడు రాసింది అని చెబుతారు. రాజనీతిని విపులంగా తెలిపే ఈ గ్రంథం కేవలం అర్ధశాస్త్రానికే సంబంధించినది కాదు. మనిషి జీవితం విజయవంతం కావాలంటే పనికి వచ్చే గ్రంథం కూడా! 'కుటిల' అనే తన గోత్రం కలిపి కౌటిల్యుడి పేరుతో అర్ధశాస్త్రం రాసాడు అని ఒక కథనం కూడా ఉంది.

చాణక్యుడిని గురించి రకరకాల కథనాలు వ్యాప్తిలో వున్నాయి. అయితే చంద్రగుప్త మౌర్యుడిని మగధ రాజ్యానికి రాజుగా చేయటానికి చాణక్యుడి బుద్ధి కుశలత బాగా పనికి వచ్చింది. చాణక్యుడు చూడటానికి వికృతంగా వుండేవాడని ఒక కథనం వుంది. తక్షశిల విశ్వవిద్యాలయంలో చదువుకోటమే కాకుండా అక్కడ అధ్యాపకుడిగా పని చేసిన అనుభవంతో మగధ రాజైన మహానందుడి దగ్గరకు చాణక్యుడు వెళ్తాడు. అప్పట్లో అలెగ్జాండర్ హిందూ దేశాన్ని ఆక్రమించుకొనే పనిలో వున్నాడు. చిన్న చిన్న రాజ్యాలను హస్తగతం చేసుకుంటున్న తరుణంలో, పాటలీపుత్రకు వెళ్ళినందుడికి రాజకీయసలహా ఇచ్చి రాజ్యాన్ని ఏవిధంగా కాపాడుకోవచ్చునో చెప్పాలని చాణక్యుడి ఆలోచన. తాగుబోతు, అన్ని విధాలా చెడిపోయి వున్న రాజు నందుడు, 'నువ్వేమిటి? ఇంత వికృతంగా వున్నావు. నా సభలో వుండే అర్హత లేదని' అవమానిస్తాడు. దానితో చాణక్యుడు నందుడి వంశాన్ని కూలద్రోసేందుకు శపథం పూని చంద్రగుప్తుడిని దగ్గరకు తీస్తాడు. చంద్రగుప్తుడి తల్లి ముర అనుజ్ఞతో చంద్రగుప్తుడికి అన్ని విధాల సహాయపడటమే కాకుండా, రాజుకు వీరుడికి కావల్సిన అనేక రకాల శిక్షణను ఇచ్చి నందుని వంశాన్ని విజయవంతంగా కూల ద్రోసి చంద్రగుప్త మౌర్యుడిని రాజుగా చేసి, అతని సలహాదారుగా, చంద్రగుప్త మౌర్యుడు సార్వభౌముడు అయ్యే విధంగా విజయుడయి, అతని ప్రతిజ్ఞను తీర్చుకుంటాడు.